సాక్షి
అన్నమయ్య జిల్లా

గురువారం । 18 । సెప్టెంబర్ । 2025



ఆర్టీసీ అద్దెబస్సు బోల్తా

సిద్దవటం నుంచి కడపకు వెళ్తున్న ఆర్టీసీ అద్దె బస్సు భాకరాపేట సమీపంలోని కల్వర్టు వద్ద బోల్తా పడింది. డ్రైవర్, కండక్టర్‌తో పాటు నలుగురికి గాయాలయ్యాయి. -8లో



హత్యకేసులో సంచలన తీర్పు

నర్రెడ్డి నమిత్రమ్మ హత్య కేసులో ప్రధాన నిందితురాలు ఇందిరమ్మకు జీవిత ఖైదు, రూ.5 వేల జరిమానా విధిస్తూ రాజంపేట మూడో అదనపు జిల్లా జడ్జి తీర్పు చెప్పారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.200	రూ.250
రెండోరకం	రూ.140	రూ.190



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 96 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	645	645
బైవోల్టిన్	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 178.040 కిలోలు

న్యూస్‌రీల్

పంట నమోదు ప్రక్రియ తనిఖీ

రాయచోటి: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం రాయచోటి రూరల్ మండలం, ఎగువ అబ్బవరం గ్రామంలో జరుగుతున్న పంట నమోదు ప్రక్రియను జేసీ పరిశీలించారు. రాయచోటి అర్బన్ ఆర్‌ఎస్‌కె ఇన్‌చార్జిని పంట నమోదు ప్రక్రియ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రాయితీలకు పంట నమోదు ముఖ్యమన్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని జేసీ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జి శివనారాయణ, మండల వ్యవసాయ అధికారి కె రాజేంద్ర ప్రసాద్, వీఏఏ శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఏఎఫ్‌యూలో కోర్సులకు అనుమతులు

కడప ఎడ్యుకేషన్: డాక్టర్ .వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలోని ఆర్కిటెక్చర్ విద్యార్థులకు సీఓఏ(కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్) నుంచి కోర్సులకు అనుమతులు, ఎన్‌రోల్‌మెంట్ నంబర్లు మంజూరయ్యాయని వైస్ చాన్సలర్ విశ్వనాథకుమార్ తెలిపారు. ఇందులో ఆర్కిటెక్చర్ విభాగానికి సంబంధించి 2020-21, 2021-22, 2022-23 బ్యాచ్‌ల విద్యార్థులకు సీఏఓ నుంచి కోర్సు అనుమతులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

రేపు జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: వైఎస్‌ఆర్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, ఏపీఎస్‌ఎస్‌డీసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9.00 గంటలకు జమ్మలమడుగులోని సాయి పరమేశ్వర డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 12 కంపెనీల ప్రతినిధులు ఇందులో పాల్గొంటారన్నారు. అభ్యర్థులు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఎంటెక్ చదివి ఉండాలన్నారు. 18-40 సంవత్సరాల మధ్య వయస్సుగల అభ్యర్థులు ఇందుకు అర్హులన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలు, ఫొటోలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఆయన సూచించారు.

మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం వృద్ధి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారులు

రాయచోటి టౌన్: మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబం, సమాజం వృద్ధి చెందుతుందని డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనరసయ్య అన్నారు. ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న స్వస్థ్ నారీ సశక్త్ అభియాన్ కార్యక్రమాన్ని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో రాయచోటి ఏరియా ఆస్పత్రిలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. తల్లి ఆరోగ్యంగా ఉన్నప్పుడే పిల్లలకు పాల ద్వారా బలమైన ఆహారం అందుతుందన్నారు. మహిళలు సమయానుకూలంగా వైద్యుల సేవలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం స్టేట్ అబ్జర్వర్ మధుకర్, డాక్టర్ డి. సంధ్య, డాక్టర్ శివ ప్రతాప్, ఏరియా ఆస్పత్రి సూపరిండెంటెంట్ డాక్టర దేవిడ్ సుకుమార్, ఐసీడీఎస్ పీడీ హైమావతి, దేవశిరోమణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సవాళ్లు!



- జిల్లా కలెక్టర్, ఎస్పీలకు స్వాగతం పలుకుతున్న సమస్యలు
- జిల్లాలో ఎక్కడ చూసినా పేకాట, విచ్చలవిడిగా మద్యం విక్రయాలు
- మదనపల్లె కేంద్రంగా హత్యలు
- అధికార పార్టీ ఆగడాలు, పెరిగిపోయిన భూ ఆక్రమణలు, కబ్జాలు
- శేషాచలం అడవుల నుంచి తరలిపోతున్న ఎర్ర బంగారం



నిశాంత్ కుమార్, కలెక్టర్

ధీరజ్, ఎస్పీ

అన్నమయ్య జిల్లా కలెక్టరేట్

సాక్షి రాయచోటి: జిల్లాలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్‌లకు సమస్యలు సవాలుగా మారనున్నాయి. అన్నమయ్య జిల్లా 2022 ఏప్రిల్ 4న ఆవిర్భవించింది. జిల్లాల పునర్విభజనలో భాగంగా రాయచోటిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసి ఆరు నియోజకవర్గాలతో జిల్లాను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పీఎస్ గిరీషా, అభిషిక్త్ కిశోర్, చామకూరి శ్రీధర్‌లు పనిచేయగా, నూతనంగా నాలుగో కలెక్టర్‌గా నిషాంత్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. జిల్లాపోలీసు సూపరింటెండెంట్‌లుగా మొదటగా హర్షవర్ధన్‌రాజు, గంగాధర్‌రావు, కృష్ణారావు, విద్యాసాగర్ నాయుడులు పనిచేయగా జిల్లా ఐదో ఎస్పీగా ధీరజ్ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించగానే విజయవాడలో సీఎంతో కలెక్టర్లు, ఎస్పీల సమీక్షల నేపథ్యంలో అక్కడికి వెళ్లారు. అయితే జిల్లాలో వేళ్లూనుకున్న సమస్యలు, ఇతర శాంతిభద్రతల పరంగా అనేక రకాల సమస్యలు కలెక్టర్, ఎస్పీలకు సవాలుగా మారుతున్నాయి.

జిల్లా కేంద్రంలో సాగని అభివృద్ధి

అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఏర్పడిన అనంతరం వైఎస్ జగన్ సర్కార్ హయాంలో అభివృద్ధి పరంగా పరుగులు తీసింది. ఎక్కడికక్కడ జాతీయ రహదారుల్లో మహనీయుల విగ్రహాలు, డివైడర్లు, ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే పార్కుల ఏర్పాటు ఇలా ప్రతి ఒక్క పని పరుగులు పెట్టింది. డీఎస్పీ కార్యాలయం, ఆర్‌అండ్‌బీ అతిథిగృహం, సచివాలయాలు, ఆర్బీకేలు ఇలా చెబుతూ పోతే చాలావరకు పూర్తయ్యాయి. ఆస్పత్రి ఆధునికీకరణ పనులు కూడా పూర్తి చేశారు. కొత్తహంగులు అద్దుకునే దశలో పనులు పెండింగ్‌లో పడిపోయాయి. ప్రధానంగా క్రికెట్ స్టేడియం, శిల్పారామం, నగరవనం, ఎంఐజీ లేఅవుట్ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో అక్కడక్కడ రోడ్లు మినహా మిగతా పనులన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. ఇలాంటి తరుణంలో కొత్త ప్రణాళికతో నూతన కలెక్టర్ పెండింగ్ పనులతోపాటు ఇతర అభివృద్ధి పనులను పరుగులు పెట్టించాలని ప్రజలు కోరుతున్నారు.

- జిల్లాకు సంబంధించి ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి అనేక వనరులు ఉన్నాయి. మదనపల్లె, సిద్దవటం మండల పరిధిలోని చేనేత రంగం బాగా పటిష్టంగా ఉంది. అక్కడ ప్రభుత్వ పరంగా టెక్స్‌టైల్స్ పరిశ్రమలు తేవడం ద్వారా పలువురికి ఉపాధి కల్పించే అవకాశాలు ఉన్నాయి. రైల్వేకోడూరు పరిధిలోని శెట్టిగుంట చెక్కబొమ్మల తయారీకి ప్రసిద్ధి. అలాగే రైల్వేకోడూరు, రాయచోటి, మదనపల్లె, రాజంపేట, పీలేరు ప్రాంతాల్లో మామిడి, అరటి, బొప్పాయి పంటల సాగు అధికంగా ఉంది. హార్టికల్చర్ పరంగా ఏదైనా అభివృద్ధి చేసేందుకు అవకాశాలు ఉన్నాయి. జ్యూస్, గుజ్జు పరిశ్రమలు తీసుకు రావడం ద్వారా అటు రైతులకు, ఇటు యువతకు ఉపాధి లభిస్తుంది. తంబళ్లపల్లె, మదనపల్లె ప్రాంతాల్లో గ్రానైట్‌తోపాటు మైనింగ్ పరిశ్రమలు ఉన్నాయి. మంగంపేటలో పేరెన్నికగన్న బెరైటీస్, ముగ్గురాయి పరిశ్రమలు ఉన్నాయి. ఏపీఎండీసీపై ఆధారపడి వందల సంఖ్యలో చిన్నచిన్న పరిశ్రమలు ఉన్న నేపథ్యంలో పూర్తి స్థాయిలో ప్రోత్సాహం అందిస్తే పెద్ద ఎత్తున ప్రయోజనాలు ఒనగూరనున్నాయి.

ఆరితేరిన అక్రమార్కులు

జిల్లాలో శాంతిభద్రతల పరంగా ప్రస్తుతం ఎలాంటి సమస్యలు లేకపోయినా చాలాచోట్ల అక్రమార్కులు ఆరితేరిపోయారు. ఎక్కడికక్కడ అసాంఘిక కార్యకలాపాలను నిర్వహిస్తూ అధికారం మాటున సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలో ప్రస్తుతం పేకాట, దౌర్జన్యాలు, దాడులు అధికంగా సాగుతున్నాయి. ప్రధానంగా ఇసుక అక్రమ రవాణా రాత్రిపూట యథేచ్ఛగా సాగుతోంది. ఎర్రచందనానికి ప్రసిద్ధి చెందిన శేషాచలం అడవుల నుంచి అక్రమార్కులు దుంగలను తరలిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులతో అప్పుడప్పుడు కొన్ని దుంగలు దొరకుతున్నాయి. రేషన్ బియ్యం అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. మరోవైపు ప్రతినిత్యం ఆవులు, పశువులను పెద్ద సంఖ్యలో లారీలలో తరలిస్తున్నారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రాయచోటి, మదనపల్లె మీదుగా బెంగుళూరుకు పెద్ద ఎత్తున పశువుల దందా సాగుతోంది. ఇందులో భాగంగా పలువురు పోలీసులతో మామూళ్లు మాట్లాడుకుని పశువుల రవాణాకు ఇబ్బందులు లేకుండా చేసుకుంటున్నట్లు పోలీసు వర్గాల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

మదనపల్లె కేంద్రంగా అసాంఘిక వ్యవహారాలు

జిల్లాలోనే ప్రధాన పట్టణంగా గుర్తింపు పొందిన మదనపల్లెలో అసాంఘిక కార్యకలాపాలు రాజ్యమేలుతున్నాయి. పీలేరు, మదనపల్లె, రాయచోటి, రాజంపేట ప్రాంతాల్లో గంజాయి చాపకింద నీరులా విద్యార్థుల దరిచేరుతోంది. ఇందుకు ఉదాహరణగా గతంలో ఇద్దరు విద్యార్థులు గంజాయి మత్తులో రైలు కిందపడి మృతి చెందారు. మదనపల్లెలో కూడా గంజాయి వాసనలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ఇటీవల అనేక హత్యలు కూడా చోటుచేసుకున్నాయి. క్షణికావేశంలో జరిగే హత్యలు కొన్ని అయితే, ఓ సీఐ తల్లికి మాటమాటలు చెప్పి నగలు దోచుకుని మట్టుబెట్టిన వైనం గతంలో సంచలనం సృష్టించింది. బాలలపై అఘాయిత్యాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోయాయి. జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ధీరజ్ మదనపల్లెపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.జిల్లాలోని గువ్వలచెరువు ఘాట్, రాయచోటి-చిత్తూరు జాతీయ రహదారితోపాటు కడప-రేణిగుంట ప్రధాన రహదారిలోని రైల్వేకోడూరు, రాజంపేట ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. మరోవైపు జిల్లాలో భూ కబ్జాలు, రౌడీయిజం పెరిగింది. రాయచోటి ఇటీవల వరుస ఘటనలు చోటుచేసుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలపై నూతన ఎస్పీ ఉక్కుపాదం మోపాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

వైఎస్‌ఆర్ జిల్లాలో వర్షం



కడప అగ్రికల్చర్: అల్పపీడనం కారణంగా జిల్లాలో మంగళవారం తెల్లవారుజాము నుంచి బుధవారం ఉదయం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా కొండాపురం, మైలవరం, పెద్దముడియం, జమ్మలమడుగు. కలసపాడు, అట్లూరు మండలాలు మినహా మిగతా 30 మండలాల్లో వర్షం కురిసింది. జిల్లాలో చాలా మండలాల్లో ప్రస్తుతం ఉల్లి పంట కోతలు ప్రారంభించారు. తడికి ఉల్లిగడ్డలు దెబ్బతింటాయని ఉల్లి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ వర్షం వరిపంట సాగు చేసిన రైతులకు చాలా మేలు.వరికి సోకిన చీడపీడలు తొలిగి పంట ఏపుగా పెరిగే అవకాశం ఉంటుంది. మిగతా ఆరుతడి పంటలైన పత్తి, వేరుశనగ, పసుపు, మొక్కజొన్న, సజ్జ పంటలకు, మామిడి, సపోట, చీని, నిమ్మ, డ్రాగెన్ ఫ్రూట్ వంటి ఉద్యాన పంటలకు కూడా ఈ వర్షం మేలేనని రైతులు తెలిపారు. చాపాడులో అత్యధికంగా 80.2 మిల్లీమీటర్లు, కాశినాయనలో అత్యల్పంగా 1 మిల్లీమీటర్ వర్షం కురిసింది.

మండలం కురిసిన వర్షం(మి.మీ)

మండలం	వర్షం	మండలం	వర్షం
చాపాడు	80.2	సిద్దవటం	16.2
ఖాజీపేట	66.0	లింగాల	11.8
కడప	62.4	సింహాద్రిపురం	11.4
సికెదిన్నె	55.8	ఒంటిమిట్ట	4.2
బి. కోడూరు	47.4	మైదుకూరు	4.0
ఎర్రగుంట్ల	46.8	పులివెందుల	4.0
చెన్నూరు	44.4	వీఎన్‌పల్లి	3.8
పెండ్లిమర్రి	39.6	వేముల	3.0
చక్రాయపేట	30.0	బిమతం	4.0
వేంపల్లి	29.2	పోరుమామిళ్ల	2.8
పొద్దుటూరు	28.2	రాజుపాలెం	2.8
వల్లూరు	26.4	ముద్దనూరు	2.8
తొండూరు	24.6	బద్వేల్	1.8
కమలాపురం	18.2	గోపవరం	1.2
దువ్వూరు	16.4	కాశినాయన	1.0

కష్టపడి పనిచేసేవారికి విశ్వకర్మ ఆదర్శం



విశ్వకర్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డీఆర్‌ఓ మధుసూదన్ రావు

రాయచోటి: వృత్తులకు ఆద్యుడైన దైవిక వాస్తుశిల్పి విశ్వకర్మ కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని చేతి, కుల వృత్తుల వారు తమలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని డీఆర్‌ఓ మధుసూదన్ రావు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. డిఆర్‌ఓ మధుసూదన్ రావు విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కృష్ణుడు పరిపాలించిన పవిత్రమైన ద్వారకా నగరాన్ని, పాడవులకోసం ఇంద్రప్రస్థ రాజభవనాన్ని నిర్మించడంతోపాటు దేవతలకు అనేక అద్భుతమైన ఆయుధాలను తయారు చేశారన్నారు. విశ్వకర్మను దివ్య వడ్రంగి అని కూడా భావిస్తుంటారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి సురేష్, కలెక్టరేట్ ఏఓ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఘన నివాళి: విశ్వకర్మ భగవానుడు కేవలం దేవతల శిల్పి మాత్రమే కాదని, కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ ఆదర్శమని జిల్లా అదనపు ఎస్పీ ఎం వెంకటాద్రి అభిప్రాయపడ్డారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబల్లి ఆదేశాల మేరకు రాయచోటిలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో విశ్వకర్మ చిత్రపటానికి అదనపు ఎస్పీ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. విశ్వకర్మను నిర్మాణ శాస్త్రానికి సృష్టికర్తగా (ఆర్కిటెక్చర్), ఆద్యుడిగా భావిస్తారన్నారు. చేతి వృత్తుల కళాకారులు, ఇంజినీర్లు, కార్మికులు, పారిశ్రామిక వేత్తలు వంటి వారందరికీ విశ్వకర్మ స్ఫూర్తిగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో ఏఆర్‌డీఎస్పీ ఎం శ్రీనివాసులు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు విజె రామకృష్ణ, ఎం పెద్దయ్య, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, ఇతర పోలీసులు అధికారులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ఒంటిమిట్ట: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ పి మనోరమ తెలిపారు. శుభ్రతతో వ్యాధులు దరిచేరవని తెలిపారు.బుధవారం మండలంలోని చింతరాజుపల్లి పంచాయతీలోగల చింతరాజుపల్లి హరిజనవాడ, గాండ్లపల్లి గ్రామాలలో విష జ్వరాలు, కీటక వ్యాధులపై మలేరియా సబ్ యూనిట్ అధికారి డాక్టర్ ఐ సుబ్బరాయుడు, మండల వైద్యాధికారి డాక్టర్ భావనతో కలిసి ఆమె విస్తృత పర్యటన చేశారు. ఇంటింటికి తిరిగి లార్వా, వైరల్ జ్వరాల సర్వే నిర్వహించారు. అక్కడ అనారోగ్యంతో బాధపడుతున్న కొంతమందికి విష జ్వరాలకు సంబంధించి రక్త పరీక్షలు చేయగా అందరికీ నెగిటీవ్ వచ్చినట్లు నిర్ధారించారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద మురికినీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని మలేరియా అధికారు పేర్కొన్నారు.కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ జి భాస్కర్ రెడ్డి, ఏ లక్ష్మీనరసమ్మ, ఆరోగ్య కార్యకర్తలు ఎస్ కరిముస్నీషా, ఎ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.



చింతరాజుపల్లి హరిజనవాడలో జ్వరాలపై సర్వే చేస్తున్న జిల్లా మలేరియా అధికారి మనోరమ

ప్రయాణికుల మన్ననలు పొందేలా సేవలు

కడప కోటిరెడ్డిసర్కిల్: విమాన ప్రయాణీకుల మన్ననలు పొందేలా సేవలు అందిస్తున్నామని కడప ఎయిర్‌పోర్టు డైరెక్టర్ సుజిత్‌కుమార్ పొదార్ తెలిపారు. బుధవారం ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు కడప ఎయిర్‌పోర్టులో యాత్రి సేవా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. తొలుత వివిధ ప్రాంతాల నుంచి కడపకుచేరుకున్న యాత్రికులకు డైరెక్టర్‌తోపాటు ఇతర అధికారులు స్వాగతం పలికారు. అలాగే పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఓం శాంతి సంస్థ ప్రతినిధులు, రామకృష్ణ మిషన్ సభ్యులు, ఎయిర్‌పోర్టు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత



డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాను కలిసిన జిల్లా ఎస్పీ ధీరజ్ కనుబిల్లి

రాయచోటి: జిల్లా ప్రజల భద్రతను కాపాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సూచించినట్లు జిల్లా ఎస్పీ ధీరజ్ కనుబిల్లి తెలిపారు. జిల్లా నూతన ఎస్పీ ధీరజ్ కనుబిల్లి బుధవారం విజయవాడలోని డీజీపీ కార్యాలయంలో రాష్ట్ర డీజీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. నేరాల నివారణకు పటిష్ట చర్యలు, నేరస్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు సురక్షితంగా ఉండే వాతావరణం కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కఠిన నిబంధనలు అమలుతోపాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించినట్లు పేర్కొన్నారు. ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెంచేలా పారదర్శక సేవలు అందించాలని, నేరస్తులకు కఠిన శిక్ష, ప్రజలకు న్యాయం జరిగేలా చూడటమే పోలీసు వ్యవస్థ లక్ష్యమని సూచించినట్లు తెలియపరిచారు. డీజీపీ ఆదేశాల మేరకు ప్రజల భద్రత, న్యాయం, శాంతి స్థాపనలో తన వంతు కృషి చేస్తామని ఎస్పీ పేర్కొన్నారు.

కొనసాగుతున్న యూరియా కష్టాలు




బురకాయలకోట సచివాలయం వద్ద యూరియా కోసం క్యూ కట్టిన స్థానిక రైతులు

ములకలచెరువు: రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. బుధవారం ములకలచెరువు మండలంలోని బురకాయలకోట సచివాలయం వద్ద ఉదయం 10 గంటలకే యూరియా కోసం క్యూ కట్టారు. స్థానిక కూటమి నాయకులు రైతులను పక్కన పెట్టి తమ పార్టీ వారి కోసం అధికారులపై ఒత్తిడి చేశారు. గమనించిన రైతులు అధికారులపై తిరగపడడంతో కూటమి నాయకులు వెళ్లిపోయారు.

ఆర్భాటం.. హంగామా?

- డీఎస్సీ ఆర్డర్లకు 500 కిలోమీటర్లు వెళ్లాలా!
- మండిపడుతున్న అభ్యర్థులు



మదనపల్లె సిటీ: మెగా డీఎస్సీ పేరుతో కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటానికి తెర లేపింది. 150 రోజుల పాటు కసరత్తు జరిపి హంగామా చేశారు. తీరా అర్హులకు న్యాయం చేశారా అంటే అదీ లేదు. అనర్హులకు, అనుకూలమైనవారికి ఉద్యోగాలు కల్పించారని ప్రచారం జరుగుతోంది .ఇప్పుడు నియామకపత్రాల పంపిణీ పేరుతో మరో డ్రామాను తెరమీదకు తెచ్చారు. ఈనెల 19న విజయవాడ వేదికగా నిర్వహించే కార్యక్రమంలో మెగా డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన వారికి నియామకపత్రాలు పంపిణీ చేస్తామంటూ హంగామా సృష్టిస్తోంది. ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల నుంచి విజయవాడకు రావాలని ఆదేశాలు జారీ చేశారు. దీనిపై పలువురు మండిపడుతుండటంతో ఏం చేయాలో దిక్కుతోచక అధికారులు తలలు పట్టుకోవాల్సి వస్తోంది.

- ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల వ్యాప్తంగా నిర్వహించిన మెగా డీఎస్సీ కసరత్తు విమర్శలకు తావిస్తోంది.150 రోజుల పాటు సాగదీసి అర్హులకు మొండి చేయి చూపారని పలువురు మండిపడుతున్నారు. ఈనెల 15న మెగా డీఎస్సీ తుది ఎంపిక జాబితాను ప్రచురించారు. ఈ జాబితా ప్రచురించాక వందల సంఖ్యలో హెల్ప్‌డెస్క్‌కు కాల్ చేశారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయాలకు వెళ్లారు. న్యాయం చేయాలని వేడుకున్నారు. అభ్యర్థులకు విద్యాశాఖ అధికారులు సమాధానం చెప్పలేని స్థితిలో మిగిలిపోయారు.
- గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం డీఎస్సీ (డిస్ట్రిక్ సెలెక్షన్ కమిటీ) పేరుతో తిలోదకాలు వదిలింది. నిబంధనల ప్రకారం డీఎస్సీ కసరత్తు మొత్తం ఎన్నో ఏళ్లుగా జిల్లా స్థాయిలోనే జరిగేది. అయితే ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలోనే నిర్వహించారు. ఇందులో పలు అక్రమాలు జరిగాయని అభ్యర్థులు వాపోతున్నారు. ఫలితాలు వెల్లడించిన తర్వాత మెరిట్, రోస్టర్ ప్రకారం విడుదల చేయాల్సిన జాబితా ఆఖర్లో గందరగోళం సృష్టించారు.ఎంపిక జాబితా పేరుతో ఐదు సార్లు ప్రచురించి, కాల్‌లెటర్లు పంపి, సర్టిఫికెట్లు పరిశీలించారు. తీరా తుది జాబితా ప్రచురించే సమయానికి ఎక్కువ ర్యాంకులు ఉన్న అభ్యర్థులకు ఉద్యోగాలు, తక్కువ ర్యాంకులు వచ్చిన అభ్యర్థులకు అనర్హులుగా పేర్కొన్నారు. దీంతో వందలాది మంది నష్టపోయారు.



ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు: **1,408** మంది

ఉమ్మడి కడప జిల్లాలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు: **680** మంది

- మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు అందజేసే నియామకపత్రాలు పంపిణీ కసరత్తును కూటమి ప్రభుత్వం రాజకీయ ప్రచారంగా మలుచుకుంది. ఈ ప్రక్రియను రాష్ట్ర స్థాయిలో విజయవాడలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులతో పాటు వారి కుటుంబసభ్యులు కూడా రావాలని విద్యాశాఖ అధికారులు సందేశాలు పంపారు. దాదాపు 500 కిలోమీటర్లు దూరం వెళ్లాలంటే ఎంతో వ్యయప్రయాసాలతో కూడుకున్న పని. డీఎస్సీకి ఎంపికైన వారిలో గర్భిణులు, చంటిపిల్లల తల్లులు కూడా ఉన్నారు. వీరు అంతదూరం వెళ్లాలంటే ఇబ్బందులు పడాలి. ప్రభుత్వ నిర్ణయంపై పలువురు మండిపడుతున్నారు.

జిల్లాలోనే నియామకపత్రాలు ఇవ్వాలి



డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులకు జిల్లాస్థాయిలోనే నియమాకపత్రాలు ఇవ్వాలి. విజయవాడకు వెళ్లాలంటే 500 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇలా చేయడం అన్యాయం. అధికారులు పునరాలోచించాలి.

–రెడ్డప్పరెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షులు

క్లుప్తంగా

ఉపాధ్యాయుడి హఠాన్మరణం


శ్రీధర్‌రెడ్డి(ఫైల్)

చిన్నమండెం : మండలంలోని టి.చాకిబండ జడ్పీ హైస్కూల్(తెలుగు)లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు శ్రీధర్‌రెడ్డి(55)కి పాఠశాలలోనే హఠాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందారు. రోజు మాదిరిగా ఉదయం పాఠశాలకు వచ్చిన ఆయన హఠాత్తుగా గుండెపోటు రావడంతో కింద పడిపోయాడు. తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు హుటాహుటిన ఆసుపత్రికి తరలిస్తుండగా తూర్పుపల్లి వద్దకు రాగానే మృతి చెందారు. శ్రీధర్‌రెడ్డి సొంత ఊరు సంబేపల్లె మండలం మొటుకువాండ్లపల్లె. ప్రస్తుతం చిన్నమండెం మండలంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు కలరు. మండలంలోని తోటి ఉపాధ్యాయులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

వైన్ షాపులో చోరీ


వైన్ షాప్ పరిశీలిస్తున్న ఎస్ఐ రఘురామ్

గుర్రంకొండ : మండలంలోని గుర్రంకొండలోని ఆర్‌కే బ్రాందీషాపులో చోరీ జరిగింది. స్థానిక తూముకుంట రోడ్‌లో ఆర్‌కే బ్రాందీ షాప్ నిర్వహిస్తున్నారు. బుధవారం వేకువ జామునే గుర్తుతెలియని దుండగులు బ్రాందీ షాపు పైభాగంలో రేకు కత్తిరించి దుకాణంలో ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. దుకాణంలోని ఓ ల్యాప్‌టాప్, రూ.50 వేల విలువ చేసే మద్యం సీసాలు చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ రఘురామ్ సిబ్బందితో కలసి వచ్చి వైన్ షాపు, చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. షాపు నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : అన్నమయ్య జిల్లా కేవీ.బావి అటవీ ప్రాంతంలో తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం పది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ ఎండీ షరీఫ్, సిబ్బంది కోడూరు పరిధిలోని కెవీ.బావి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. బుధవారం తెల్లవారుజామున నొక్కోడి గుండం వద్ద కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు మోసుకుని వెళుతూ కనిపించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులను చూసి వారు తప్పించుకుని పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని వెంబడించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఆ ఇద్దరూ తమిళనాడుకు చెందిన వారుగా గుర్తించారు. దుంగలతో పాటు వారిద్దరినీ తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. డీఎస్పీ శ్రీనివాస రెడ్డి, ఏసీఎఫ్ శ్రీనివాస్ విచారించారు. సీఐ సురేష్ కుమార్ కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కక్ష సాధింపులకు దిగడం హేయమైన చర్య

అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలోనే ప్రజా వ్యతిరేకత మూటకట్టుకున్న కూటమి ప్రభుత్వం నిజాలను ప్రచురించే మీడియాపై కక్ష సాధింపులకు దిగడం హేయమైన చర్య. ఏకంగా పత్రికా స్వేచ్ఛను హరించేలా కేసులు నమోదుచేయడం అన్యాయం. భయపెట్టి నిజాలను కప్పివేయాలనుకోవడం అవివేకం. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి, పాత్రికేయులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి. – డాక్టర్ దాసరి సుధ, ఎమ్మెల్యే, బద్వేలు





బేషరతుగా కేసులు ఉపసంహరించుకోవాలి



'సాక్షి' ఎడిటర్‌తో పాటు ఆ పత్రికలో పనిచేస్తున్న జర్నలిస్టులపై నమోదు చేసిన అక్రమ కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలి. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలిచి ప్రజల గొంతుకను వినిపిస్తున్న పత్రికపై కక్షపూరిత చర్యలకు పాల్పడటం అప్రజాస్వామికం. పత్రికలపై దాడులు చేస్తూ అక్రమ కేసులు బనాయించడం అంటే కలానికి సంకెళ్ళు వేయడమే. పత్రికల్లో వచ్చిన వార్తలు అభ్యంతరకరంగావుంటే వివరణ కోరాలే తప్ప కేసులు పెట్టి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడం సరైనది కాదు. – ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే, రాజంపేట

ఆర్టీసీ అద్దెబస్సు బోల్తా

డ్రైవర్, కండక్టర్‌తో సహా, నలుగురికి స్వల్ప గాయాలు


బోల్తాపడిన బస్సును క్రేన్ సహాయంతో బయటకు తీస్తున్న దృశ్యం

సిద్దవటం : సిద్దవటం నుంచి కడపకు వెళ్తున్న ఏపీ39 యుజీ4591 నెంబర్ అల్లా పల్లె వెలుగు ఆర్టీసీ అద్దె బస్సు బుధవారం భాకరాపేట సమీపంలోని కల్వర్టు వద్ద బోల్తా పడింది. ఈ బస్సులో బస్సు డ్రైవర్ వెంకటనారాయణ, కండెక్టర్ శివయ్యతో పాటు భారతీ, వెంకటేష్, సుబ్బనరసమ్మ, లక్ష్మమ్మలకు స్వల్ప గాయాలయ్యాయి. అద్దె బస్సు డ్రైవర్ వెంకటనారాయణ కథనం మేరకు..భాకరాపేట సమీపంలోని పెద్దవంక కల్వర్టు వద్ద కడప నుండి బద్వేల్‌కు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ ఆర్టీసీ బస్సు అతి వేగంగా వస్తుండగా కల్వర్టు రహదారిపై బస్సు నిలిపివేయడం జరిగిందన్నారు. బస్సులో అరవై మందికి పైగా ప్రయాణికులు ఉన్నారని, బస్సు అదుపుతప్పి బోల్తా పడిందన్నారు. కండక్టర్ శివయ్యపై ప్రయాణికులు పడటంతో చేతికి గాయాలయ్యాయన్నారు. మరో నలుగురు ప్రయాణికులకు కూడా స్వల్ప గాయాలతో బయటపడ్డారన్నారు. విషయాన్ని తెలుసుకున్న 11వ బెటాలియన్ పోలీసులు బస్సు అద్దాలను పగులగొట్టి గాయపడిన వారిని బయటకు తీసి చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారని తెలిపారు. ప్రమాదం జరిగిన సమాచారం తెలుసుకున్న కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, బద్వేల్ ఆర్టీసీ డిపో మేనేజర్ నిరంజన్, బద్వేల్, కడప ఆర్టీఓలు జాన్‌ఇర్విన్, చంద్రమోహన్, 11వ ఏపీఎస్పీ వెంకటేశ్వర్లు, బద్వేల్ ఆర్టీసీ డిపో మేనేజర్ నిరంజన్, కమాండెంట్ ఆనంద్‌రెడ్డి, ఒంటిమిట్ట సీఐ బాబు, ఎస్ఐ మహమ్మద్ రఫీ, ఆర్అండ్‌బీ ఏఈ రామాంజనేయులు, డిప్యూటీ తహసీల్దారు మాధవీలత సంఘటనా స్థలానికి చేరుకొని సంఘటనకు దారి తీసిన కారణాలను తెలుసుకున్నారు. ఎస్ఐ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ సంఘటనా స్థలానికి చేరుకొని బోల్తాపడిన ఆర్టీసీ బస్సును రెండు క్రేన్ల సహాయంతో తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టామన్నారు. కల్వర్టు వద్ద వాహనాలు నెమ్మదిగా వెళ్లేందుకు హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశామని తెలిపారు. ఆర్టీసీ కండక్టర్ శివయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.


ప్రమాదంలో గాయపడిన వారిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలిస్తున్న దృశ్యం

వాహనం ఢీకొని మహిళ మృతి


మృతిచెందిన జయమ్మ(54)

కలకడ : గుర్తుతెలియని వాహనం ఢీకొని జరిగిన ప్రమాదంలో మహిళ మృతి చెందినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మండలంలోని కదిరాయచెర్వు పంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన పెద్దరెడ్డెప్ప భార్య శెట్టిపల్లె జయమ్మ(54) మంగళవారం పొలం వద్దకు నడచి వెళ్తోంది. మార్గమధ్యంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ జయమ్మ బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ..


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ అనిల్‌కుమార్

కలికిరి : ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన బుధవారం కలికిరిలో చోటు చేసుకుంది. వివరాలిలా వున్నాయి. కలికిరి పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన పాలగిరి నూరుల్లా తన భార్య షరీఫా(46)తో కలిసి ద్విచక్ర వాహనంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వైపు నుంచి క్రాస్ రోడ్డుకు బయలుదేరారు. వెనుకవైపు నుంచి వచ్చిన మదనపల్లె డిపో బస్సు వీరి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన షరీఫాను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అనిల్‌కుమార్ తెలిపారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిద్దాం


జిల్లా అధ్యక్షులు రెడ్డికిశోర్‌దాస్

రాయచోటి జగదాంబసెంటర్ : పేద విద్యార్థులకు వైద్యరంగంలో మరింత అవకాశాలు కల్పించాలనే దూరదృష్టితో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల స్థాపనకు శ్రీకారం చుట్టిందని, కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరించేందుకు ప్రయత్నించడాన్ని అందరూ వ్యతిరేకించాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు జంగం రెడ్డికిశోర్‌దాస్ అన్నారు. రాయచోటిలో బుధవారం ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో రూ.8,500 కోట్ల వ్యయంతో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టగా, అందులో ఐదు మెడికల్ కాలేజీలు పూర్తి అయ్యాయని పేర్కొన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రైవేట్ హాస్పిటల్స్ ప్రజలను దోపిడీ చేయగా ప్రభుత్వాసుపత్రులు మాత్రం పేదలకు అండగా నిలిచిన విషయాన్ని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఇప్పటికే ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయాలని నిర్ణయం తీసుకోవడం తగదన్నారు. ఏడాదిన్నర కాలంలోనే రూ.2.15 లక్షల కోట్ల రూపాయలు అప్పుచేసిన చంద్రబాబు ప్రజా వ్యతిరేక నిర్ణయాలను తీసుకోవడం ఆపేయాలన్నారు. జగన్ ప్రారంభించిన 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రస్తుత ప్రభుత్వం నిజాయితీగా పూర్తి చేయాలని కోరారు. ఈ నెల 19న ఉదయం 9.30 గంటలకు మదనపల్లి ప్రభుత్వ మెడికల్ కాలేజీ శానిటోరియం వద్ద చలో మెడికల్ కాలేజీ కార్యక్రమాన్ని శాంతియుతంగా నిర్వహిస్తున్నామని రెడ్డికిశోర్‌దాస్ ప్రకటించారు. ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్‌సీపీ యువజన, విద్యార్థి విభాగాలు, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

వృద్ధురాలి హత్యకేసులో సంచలన తీర్పు

కేసులో ఇందిరమ్మకు జీవిత ఖైదు


జీవిత ఖైదు శిక్ష పడిన ఇందిరమ్మతో పోలీసులు

రాజంపేట : ఎర్రబల్లికి చెందిన నర్రెడ్డి సమిత్రమ్మ(60) హత్య కేసులో రాజంపేట మూడో అదనపు జిల్లా జడ్జి ప్రవీణ్‌కుమార్ సంచలన తీర్పు వెలువరించారు. ప్రధాన నిందితురాలు వెలమచల ఇందిరమ్మకు జీవిత ఖైదు, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు. పట్టణ సీఐ నాగార్జున, ఎస్ఐ వెంకటేశ్ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. 2019 మే, 2న తన తల్లి నర్రెడ్డి సుమిత్రమ్మను ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి ఇంట్లో బంగారు వస్తువులను దోచుకెళ్లారని మృతురాలి కుమారుడు నర్రెడ్డి మహీధర్ పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. అప్పటి సీఐ నిరంజన్‌కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారన్నారు. డీఎస్పీ ఆదేశాల మేరకు ఒంటిమిట్ట సీఐ దర్యాప్తు చేసి 2020 మార్చి, 9న వెలచలమల ఇందిరమ్మ(దేవరపల్లె, వెలిచలమల్ల పంచాయితీ,నంబూలపూలకుంట మండలం ,అనంతపురం జిల్లా), నర్రెడ్డి శ్వేత(ఎర్రబల్లి,రాజంపేటటౌన్), ఒర్సు నాగరాజు (డ్రైవర్, కొండ్లవాండ్లపల్లె,నంబూపూలకుంట మండలం, అనంతపురం), మల్లెల రమేష్ (కూలి, కొండ్లవాల్లపల్లె, నంబూలపూలకుంట మండలం, అనంతపురం), ఒర్సు మల్లికార్జున (డ్రైవర్, కొండ్లవాల్లపల్లె, నంబూలపూలకుంట మండలం అనంతపురం)లను అరెస్టు చేశారు. వారి వద్ద మృతురాలికి చెందిన సరుడు, రెండు గాజులు, డైమండ్ నెక్లెస్, జత కమ్మలు, రెండు వెండి దీపాలు, హత్యకు ఉపయోగించిన దిండు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపారు. తదుపరి సీఐ చంద్రశేఖర్ వారిపై చార్జ్‌షీట్ దాఖలు చేయగా మూడో అదనపు జిల్లా జడ్జి కోర్టులో విచారణ సాగింది. సాక్ష్యాలు నిజమని తేలడంతో వెలిచెలమల ఇందిరమ్మ(47)కు జీవిత ఖైదు విధిస్తూ మూడవ అదనపు జిల్లా జడ్జి తీర్పు వెలువరించారన్నారు. ఈ కేసులో నేరారోపణ రుజువు కానందున నర్రెడ్డి శ్వేత, ఒర్సు నాగరాజు, మల్లెల రమేష్, ఒర్సు మల్లికార్జున (విచారణలో మరణం)లకు విముక్తి కలిగించారన్నారు. సీఐ నిరంజన్‌కుమార్, హనుమంత్‌నాయక్, ఎం.చంద్ర శేఖర్, పీపీ షేక్‌జానీ, ప్రస్తుత పీపీ కొమ్మినేని వేణుగోపాల్, జీ.సుబ్బరాయుడు, ఏఎస్ఐ శంకరయ్యలను రాజంపేట ఏఎస్పీ మనోజ్‌రామ్‌నాథ్‌హెగ్డే అభినందించారని వెల్లడించారు.

కారు ఢీకొని ఒకరు దుర్మరణం


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భాస్కర్‌రెడ్డి


ప్రమాదానికి కారణమైన కారు

సంబేపల్లె : మండలంలోని చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై ఓ కారు స్కూటర్‌ను ఢీ కొన్న ప్రమాదంలో భాస్కర్‌రెడ్డి(77) దుర్మరణం చెందారు. పోలీసుల వివరాల మేరకు.. కలకడ మండలం బాలయ్యగారిపల్లెకు చెందిన నగిరిమడుగు భాస్కర్‌రెడ్డి స్కూటర్‌లో సొంత పనుల నిమిత్తం కలకడకు వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా బాలయ్యగారిపల్లె క్రాస్ సమీపంలో రాయచోటి నుంచి చెన్నైకి వెళ్తున్న కారు స్కూటర్‌ను ఢీకొనడంతో భాస్కర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రాయచోటితాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పింఛా ప్రాజెక్టును సందర్శించిన సబ్ కలెక్టర్


వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ భావన


నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన మట్టి రోడ్డు

సుండుపల్లె : మండలంలోని పింఛా ప్రాజెక్టును రాజంపేట సబ్ కలెక్టర్ భావన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పురోగతి, ఇప్పటివరకు జరిగిన పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టుకు వచ్చే జల వనరులు, కుడి, ఎడమ కాల్వల ద్వారా నీటి పంపిణీ తీరుపై ఆరా తీశారు. ప్రాజెక్టు వద్ద వాతావరణం ఆహ్లాద కరంగా ఉందని, పర్యాటకులకు మరిన్ని వసతులు కల్పించి పార్కు ఏర్పాటు చేస్తే బాగుంటుందని తెలిపారు.

నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన మట్టిరోడ్డు

సుండుపల్లె : పింఛా ప్రాజెక్టు పైభాగంలో మోస్తరు వర్షాలు పడడంతో ప్రాజెక్టులోకి వరదనీరు చేరింది. దీంతో నదిలోకి నీటిని విడుదల చేశారు. ఈ ప్రవాహానికి రాయవరం బహుదా నదిపై ఉన్న మట్టి రోడ్డు కొట్టుకుపోయింది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వంతెన ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

రూ.20వేల చెక్కును రూ.2.20 లక్షలుగా మార్చి

- పెద్దినేనికాలువ సర్పంచ్ బంధువు ఫోర్జరీ
- చెక్కు మార్చారని ప్రశ్నిస్తే అధికారులపై దూషణపర్వం
- గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శికి గుండెపోటు


చెక్కులు

సుండుపల్లె : గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులకు ఇచ్చిన రూ.20 వేల చెక్కును రూ.2.20 లక్షలకు మార్చిన సంఘటన సుండుపల్లె మండలంలో చోటుచేసుకుంది. వివరాలలోకి వెళ్లితే.. పెద్దినేనికాలువ పంచాయతీలో పనులు చేసినందుకు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి సర్పంచ్ సంతకంతో కూడిన రూ.20 వేల చెక్కును ఆ సచివాలయ పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్‌రెడ్డి సర్పంచ్ బంధువైన పసుపులేటి నాగేంద్రకు రాసి ఇచ్చారు. అయితే ఆ సర్పంచ్ బంధువైన పసుపులేటి నాగేంద్ర రూ.20 వేల చెక్కులో అంకెలు మార్చి రూ.2.20 లక్షలుగా రాసి ఆ నగదును తన సొంత అకౌంట్లోకి జమచేసుకున్నాడు. పంచాయతీ నిధుల నుంచి రూ.2.20 లక్షల నగదు డ్రా చేసినట్లు పంచాయతీ కార్యదర్శి చరవాణికి సమాచారం రావడంతో చూసి ఆశ్చర్యపోయిన ఆయన వెంటనే తమపై అధికారులకు జరిగిన విషయాన్ని తెలియజేశారు. డిప్యూటీ ఎంపీడీఓ సురేష్‌బాబుతో కలిసి బ్యాంకుకు నిధులు ఆపాలని బ్యాంకు మేనేజర్‌కు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న అధికారులు నిధులు డ్రా చేసిన వ్యక్తి అకౌంట్‌ను బ్లాక్ చేశారు. అప్పటికే ఆ అకౌంట్ నుంచి రూ.20 వేల నగదు డ్రా చేసినట్లు వారు తెలిపారు. రూ.20 వేల చెక్కును రూ.2.20 లక్షలుగా ఎందుకు మార్చావని డ్రా చేసిన వ్యక్తిని పంచాయతీ కార్యదర్శి ప్రశ్నించగా తీవ్ర పదజాలంతో దూషించాడు. దీంతో తీవ్ర ఒత్తిడికి గురైన పంచాయతీ కార్యదర్శి ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లిన కొద్దిసేపటికి గుండెనొప్పి వస్తుండటంతో సిబ్బంది గుర్తించి స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మహిళ అదృశ్యం

ఎర్రగుంట్ల : మండలంలోని హనుమనుగుత్తి గ్రామానికి చెందిన దుద్దేల శ్యామల(42) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు యర్రగుంట్ల పట్టణ సీఐ విశ్వనాథ రెడ్డి తెలిపారు. శ్యామలకు మతిస్థిమితం సరిగా లేదు. ఈ నెల 9న మధ్యాహ్నం ఇంటి వద్ద నుంచి బయటకు వచ్చి కనిపించలేదు. కుటుంబ సభ్యులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నారు.

ఆన్‌లైన్ యాప్ వేధింపులతో యువకుడు ఆత్మహత్య


ముబారక్ (ఫైల్)

పీలేరు రూరల్ : ఆన్‌లైన్ యాప్ వేధింపులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పీలేరు పట్టణంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. పీలేరు పట్టణం కట్టుకాలువ వీధికి చెందిన షేక్ ముబారక్ (25) పట్టణంలోని కడప రోడ్డు మార్గంలో చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో వ్యాపారనిమిత్తం ఆన్‌లైన్ యాప్‌లో అప్పు తీసుకుని వ్యాపారం నిర్వహించాడు. వ్యాపారం సరిగ్గా జరగక అప్పు చెల్లించలేక ఇబ్బందిపడ్డాడు. ఈ క్రమంలో ఆన్‌లైన్ యాప్ నిర్వాహకులు వేధింపులు తాళలేక మంగళవారం తన ఇంటిలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు.

కూలిన పాఠశాల గోడ


కూలిన గోడ

చిట్వేలి : చిట్వేలి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీకి సంబంధించిన గోడ బుధవారం కురిసిన వర్షానికి ఒకచోట కూలిపోయింది. పాఠశాల ప్రారంభం గాక మునుపే ఉదయం ఏడు గంటల సమయంలో గోడ కూలింది. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో సంఘటనా స్థలాన్ని ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

రాయచోటి: పక్షవాతాన్ని జయించలేక ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఓ యువతి తనువు చాలించింది. పట్టణంలోని పాత రాయచోటిలో నివాసముంటున్న గౌస్ మొహిద్దీన్ భార్య షేక్ మునీరా(39) గత ఆరు నెలలుగా పక్షవాతంతో బాధపడుతోంది. ఆసుపత్రులలో చికిత్స పొందినా.. ఆరోగ్యం మెరుగు పడక పోవడంతో మానసికంగా కుంగిపోయింది. బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని చనిపోయింది. సాయంత్రం 5.30గంటలకు భర్త వచ్చి చూడగా అప్పటికే ఆమె ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. రాయచోటి పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో విఫలం

రాయచోటి : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్‌కుమార్ విమర్శించారు. ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ యూటీఎఫ్ చేపట్టిన రణభేరి జాత బుధవారం రాయచోటికి చేరుకుంది. రాయచోటి రింగ్ రోడ్డు నుంచి శివాలయం, బంగ్లా సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా డీఈఓ కార్యాలయం వరకు ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు బైక్ ర్యాలీ నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, యూటీఎఫ్ కార్యదర్శులు లక్ష్మీరాజా, జయచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్‌జాబీర్, మోడల్ స్కూల్ టీచర్ల రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యారంగంపై చిన్నచూపు చూస్తోందన్నారు. నాలుగు విడతల డీఏ ఇవ్వలేదన్నారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించడంలోనూ నిర్లక్ష్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐఆర్ ప్రకటించాలని, గ్రాట్యూటీ, మెడికల్ రీయంబర్స్‌మెంట్, ఈహెచ్ఎస్ సమస్యలు పరిష్కరించాలన్నారు. విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా బోధనేతర పనులను ఉపాధ్యాయులతో చేయిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి అసెంబ్లీ, క్యాబినెట్ సమావేశాల్లో చర్చించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25న విజయవాడలో భారీ బహిరంగసభ తర్వాత పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్‌నాయుడు, పురం వెంకటరమణ, శ్రీధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, దావూద్, ఆదినారాయణ, సురేందర్‌రెడ్డి, శివారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


రాయచోటికి చేరుకున్న బైక్ ర్యాలీ